# 5 కొరియోగ్రఫీ

కొరియోగ్రఫీ అనేమాట ఈనాడు నృత్య రూపకల్పన (Designing of dance) అనే అర్థంలో ఉపయోగింపబడుతున్నా, అసలు అర్థం 'రూపకల్పన' మాత్రమే. ఇది 1950 ప్రాంతంలో మొట్టమొదటిసారి ప్రయోగింపబడినా, ఇటీవలి కాలంలో బహుళ ప్రచారంలోకి వచ్చింది. విస్తృతార్థంలో చూసినప్పుడు వివిధ భంగిమలు ఏర్పరచడం, చిత్రాలు నిర్మించడం, అభినయం రూపొందించడం, దృశ్యాలు కల్పించడం అని నైఘంటుకార్థం.

సినిమాల్లో నృత్యదర్శకులు పరిమితార్థంలో ఉపయోగిస్తున్న ఈ కొరియోగ్రఫీని తరగతి గదికి ప్రత్యేకార్థంలో అన్వయించి ప్రయోగిస్తే, అద్భుతమైన ఫలితాలను సాధించవచ్చు. పిల్లల్లోని సృజనను, కళాభినివేశాన్ని ప్రోత్సహిస్తూ, భాషా సామర్థ్యాల సాధనకు దీన్ని పనిముట్టుగా ఉపయోగించుకోగలమేమో పరిశీలిద్దాం.

- *కొరియోగ్రఫీ / కొరియోగ్రాఫర్ లక్షణాలు ఏవి?*
- *తరగతి గదికి దీన్ని ఎట్లా అన్వయించవచ్చు?*
- *ఎటువంటి పాఠాలకు దీన్ని జోడించవచ్చు?*
- *ఏ ఏ రకాలుగా వినియోగించగలం?*

కొరియోగ్రఫీ అంటే కేవలం నృత్యరూపకల్పన కాదు. రచన, సంగీతం, మాటలు, భావాలననుసరించి చేసే అభినయ రూపకల్పన. ఇది చేసేవారినే కొరియోగ్రాఫర్ అని వ్యవహరిస్తారు.

ఏదైనా ఒక పాఠంలోని ప్రధానాంశాన్ని ముందుగా గేయం రూపంలోకిగాని, సంభాషణల రూపంలోకిగాని, రూపకంగాగాని మార్చి, ఆయా మాటలకు, పాటలకు, పద్యాలకు అనుగుణమైన అభినయాన్ని, దృశ్యాలను రూపొందించడం కొరియోగ్రఫీద్వారా పాఠ్యబోధనను సాధించే మార్గం.

కొంచెం సృజనాత్మకంగా, కొత్తకోణంలో, పరిశోధనాత్మకంగా ఆలోచించినప్పుడు ఇది సాధించడం కష్టంకాదు. పైగా విద్యార్థుల నుండి దీనికి సంపూర్ణ సహకారం లభిస్తుంది. ఫలానా పాఠానికే ఇది సరిపోతుందని పరిమితం చేయలేం. ఏ పాఠానికైనా (పద్య / గద్య / ఉపవాచక) దీన్ని రూపొందించవచ్చు.

అభినయం, మూకాభినయం, దృశ్యరూపమివ్వడం, మాస్కులను ఉపయోగించడం వంటి రకరకాల ప్రయోగాల ద్వారా మనం కొరియోగ్రఫీని తరగతి గదిలో విజయవంతంగా ప్రవేశపెట్టవచ్చు.

© SCERT not to be republished

## కొన్ని ఉదాహరణలు పరిశీలిద్దాం

1. **8వ తరగతిలో (1) దుందుభి పాఠం (గేయం) :** ఇది ఖండగతి నడకను కల్గి ఉంది. అంటే తత్తకిట – తత్తకిట – తత్తకిట – తత్తకిట అనే లయ. ఈ లయలో ఐదు మాత్రల చొప్పున మాత్రాగణాలుంటాయి. పాట నది లయను అనుకరిస్తూ సాగుతుంది. నేపథ్యంగా పాట వినిపిస్తుంటే తెరముందు రకరకాల దృశ్యాలు కదుల్తాంటాయి. నీలం రంగు చీరలు నదీ ప్రవాహానికి ప్రతీకగా కదిలిస్తూంటే రకరకాల చెట్లు, పుట్టలు, పాములు, చీమలు వగైరా మాస్కులతో, శివలింగం, తపస్సు... తదితరాంశాలను దృశ్యీకరించవచ్చు.

2. **8వ తరగతిలోనే (9) చిన్నప్పుడే (కథానిక) :** ఇది స్వాతంత్ర్యోద్యమం నేపథ్యంగా సాగే కథానిక. తెరవెనుకనుండి గంభీర స్వరంతో కథ వినిపిస్తూంటుంది. ముందర దృశ్యాలు కదుల్తాంటాయి. పాత్రలు అభినయిస్తూంటాయి. దృశ్యాలు వేగంగా మారుతుంటాయి. సహజత్వం కోసం సంభాషణలకు వేర్వేరు గొంతుకలను (కంఠస్వరం) ఇవ్వొచ్చు.

3. **8వ తరగతిలో (13) సంస్కరణ (లేఖ) :** ఇది ఒక లేఖ. లేఖ ఆవిష్కరణకు ఒక సన్నివేశాన్ని చిత్రించి, ఆ తర్వాత నేపథ్యంగా లేఖ వినిపిస్తూ, తెరముందు దృశ్యాలను (సరోజినీదేవి ప్రసంగం, వరకట్నానికి వ్యతిరేకంగా ఉద్యమం) ప్రదర్శించవచ్చు.

4. **9వ తరగతిలో (4) ప్రేరణ (ఆత్మకథ) :** అబ్దుల్ కలామ్ ఆత్మకథ ఇది. ఇది ఉత్తమ పురుషలో తెర వెనుక వినిపిస్తూంటుంది. తెర ముందు దృశ్యాలు కదులుతూ ఉంటాయి. సహజత్వం కోసం సంభాషణలనూ జోడించవచ్చు. విద్యార్థి జీవితం నేపథ్యంగా సాగే కొరియోగ్రఫీ పిల్లలను అమితంగా ఆకట్టుకుంటుందనడంలో సందేహమేలేదు.

5. **9వ తరగతిలో (7) ససేమిరా (పద్యం) :** ఇది ప్రాచీన పద్యం. పద్యాలను రాగభావయుక్తంగా, పాత్రోచితంగా తెరవెనుక నుండి పాడిస్తూ పిల్లలకు జంతువుల మాస్కులువేసి, అద్భుతంగా కథ రక్తి కట్టించవచ్చు.

కొంచెం ఆలోచిస్తే, శ్రమ తీసుకుంటే, గట్టిగా ప్రయత్నిస్తే – కొరియోగ్రఫీని అద్భుతంగా పాఠ్యబోధనకు వినియోగించవచ్చని అర్థమవుతున్నది కదా! ఇందులో పాట, ఆట, అభినయం, చిత్రం, దృశ్యం... అందంగా ఆవిష్కృతమై విద్యార్థులను తన్మయులను చేసి, బోధనను విజయవంతం చేస్తుంది. మరెందుకాలస్యం? ప్రయత్నించండి!

© SCERT not to be republished

## ఒక పాఠానికి ప్రయోగపూర్వకంగా కొరియోగ్రఫీ ఎలా నిర్వహించవచ్చో పరిశీలిద్దాం!

- పాఠాన్ని కొరియోగ్రఫీకి ఎంపిక చేసుకోవడానికి ముందు దృశ్యీకరణకు అది సరిపోతుందా, పాత్రలు ఏమేమున్నాయి? అభినయానికి గల అవకాశమెంత, తరగతి గదిలో / వేదిక మీద ప్రదర్శించడానికి వీలుందా.... అనే అంశాల గురించి ఉపాధ్యాయులు ఒక స్పష్టమైన అవగాహనకు రావాలి.
- ఉపాధ్యాయుడు తానే స్వయంగా కొరియోగ్రఫీ చేయకుండా, విద్యార్థులకే ఆబాధ్యతను అప్పగించాలి.
- పాఠం విద్యార్థులకు బాగా అర్థమయ్యేటట్లు చెప్పడమేగాక, వాళ్ళు స్వయంగా చదువుకొని, సన్నివేశాలు, పాత్రలపట్ల స్పష్టమైన అవగాహన పెంచుకునే అవకాశం కల్పించాలి.
- పిల్లలు పాఠం బాగా చదివి, పాత్రలు, సన్నివేశాల పట్ల అవగాహన పెంచుకొని, వాటి స్వరూప స్వభావాలను తమదైన శైలిలో ప్రదర్శించేలా ప్రోత్సహించాలి.
- ఉపాధ్యాయులు పిల్లల దోషాలను సవరిస్తూ, మెరుగైన ప్రదర్శన రూపొందించడంలో సహకరించాలి.

ఉదా: 8వ తరగతి : "అమ్మకోసం" అనే పద్యభాగ పాఠం

- ముందుగా కథ చెప్పి, పాత్రల స్వరూప స్వభావాలపట్ల స్పష్టమైన అవగాహన కల్పించాలి.
- పాత్ర స్వభావాన్ననుసరించి పద్యాలు పలికించాలి.
- పాత్రలకు తగిన విద్యార్థులను ఎంపిక చేయాలి / ఎంపిక చేసుకునే వెసులుబాటు విద్యార్థులకు కల్పించాలి.
- నేపథ్యంగా వినిపించాల్సిన కథ, మాటలు; పాత్రలకు సంబంధించిన మాటలు – విడివిడిగా రాయాలి.

- ✦ పద్యాలు యథాతథంగా ఉపయోగించవలసిన వాటిని గుర్తించాలి.
- ✦ పాత్రలకు తగిన మాస్కులను, దృశ్యాల్లోని చెట్లు, పుట్టలు, శివలింగం మొదలైనవి థర్మాకోల్, అట్టలు మొదలైన వాటితో తయారు చేసుకోవాలి / చేయించాలి.
- ✦ సంగీతం (అవకాశమున్నట్లయితే) ఏర్పాటు చేసుకోవాలి. ఎక్కువ మంది విద్యార్థులు ప్రదర్శనకు ఉత్సాహం చూపితే రెండు / మూడు బృందాలుగా చేసి, వారి మధ్య పోటీ నిర్వహించాలి.
- ✦ అన్నీ యోగ్యంగా ఉంటే, ఒకరి తర్వాత ఒకరికి ప్రదర్శనకు అవకాశం ఇవ్వాలి.
- ✦ వీలైతే బహుమతినిచ్చే ఏర్పాటు చేయవచ్చు.

*కళలు - ప్రాధాన్యత -*

*సమాజంలో సాంస్కృతిక అంశాలు, కళలు మొదలగువాటిని తరువాతి తరాలకు అందించడం పాఠశాలల యొక్క బాధ్యత. కళాత్మక ఉత్పాదనలో మిళితమైన నైపుణ్యాలు పిల్లల యొక్క సంపూర్ణ భావావేశ మరియు జ్ఞానాత్మక అభివృద్ధికి అత్యవసరం. ఇందుకోసం కళలను నేర్చుకోవడం, కళల ద్వారా నేర్చుకోవడం అనేవి బోధనాభ్యసన ప్రక్రియలతో మమేకం కళల ద్వారా నేర్చుకోవడం అనేవి బోధనాభ్యసన ప్రక్రియలతో మమేకం కావాలి. కళాత్మక ఆసక్తులు, సామర్థ్యాలను పెంపొందించడం, అభ్యసనం, జ్ఞానాలలో అంతర్భాగంగా ఉంటాయి. పిల్లలకు సంగీతం నేర్పితే శారీరక జ్ఞానాత్మక రంగాలలో చాలా పెద్దమార్పులు వస్తాయి. బహుముఖప్రజ్ఞ అభివృద్ధి పరచుటకు నాటకాలు, పాత్రపోషణలు, అభినయాలు మొదలగునవి బాగా తోడ్పడతాయి. ఇవి పిల్లలను తదాత్మ్యకత చెందేలా చేస్తాయి. వీటి ద్వారా పిల్లలు స్థానిక, ప్రాంతీయ దేశీయ భిన్న కళావారసత్వాన్ని తెలుసుకోగలుగుతారు. ఆ సమాజ సాంస్కృతిక వారసత్వంతో అనుబంధాన్ని ఏర్పరుచుకోగలుగుతారు.*

*- ఆం.ప్ర. రాష్ట్ర విద్యా ప్రణాళిక పరిధి పత్రం* ***- 2011***

© SCERT not to be republished